బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను ఓడించాలి



ఘట్‌కేసర్ బీజేపీ ర్యాలీలో మాట్లాడుతున్న ఎంపీ లక్ష్మణ్

ఘట్‌కేసర్: అవినీతి బీఆర్ఎస్, కుంభకోణాల కాంగ్రెస్ పార్టీలను ఓడించాలని ఎంపీ, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. ఘట్‌కేసర్‌లో మంగళవారం రాత్రి నిర్వహించిన బీజేపీ ర్యాలీలో ఆయన మాట్లాడుతూ నాలుగున్నర కోట్ల మంది ఉద్యమంతో వచ్చిన తెలంగాణ నలుగురు పాలయ్యిందన్నారు. తెలంగాణను తాగుబోతుల రాష్ట్రంగా మార్చారని, దళితులు, నిరుద్యోగులను మోసం చేసి బీఆర్ఎస్ శవ రాజకీయం చేస్తోందన్నారు. పేదల కోసం పనిచేసే బీజేపీ అభ్యర్థిని గెలించాలన్నారు. మేడ్చల్ బీజేపీ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ స్థానికేతరుడైన మంత్రి మల్లారెడ్డి ప్రజలకు చేసిందేమీ లేదని, కమలం పువ్వు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, మున్సిపల్, మండల అధ్యక్షులు హనుమాన్, ప్రవీణ్‌రావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శోభారాణి, బాల్‌రాజ్‌ముదిరాజ్, లక్ష్మారెడ్డి, దళితమోర్చ జిల్లా అధ్యక్షుడు కరుణాకర్, రామోజీ, ఆంజనేయులు, రామతీర్థ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలోకి జోరుగా చేరికలు



మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు

పోచారం: బీజేపీ, బీఆర్ఎస్‌ల నుంచి కాంగ్రెస్ పార్టీలోకి జోరుగా చేరికలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం పోచారం మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్‌కు చెందిన బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అప్పులపాలైందన్నారు. అధిక ధరలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అధిక ధరలకు అడ్డుకట్ట పడుతుందన్నారు. అందుకే హస్తం గుర్తుకే ఓటువేసి కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్(జంగయ్య)ను గెలిపించాలని కోరారు. టౌన్‌షిప్ మాజీ అధ్యక్షులు శ్రీగిరి వెంకట్ మాధవ్‌రెడ్డి, బద్దం వెంకట్‌రెడ్డి, సీనియర్ నాయకులు మెట్టు నర్సింహారెడ్డి, బద్దం సత్తిరెడ్డి, సింగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, ఎ.సత్యనారాయణరెడ్డి, హరి శ్రీనివాస్, శ్రవణ్ కుమార్‌రెడ్డి, వి.నవీన్ కుమార్‌రెడ్డి, పోరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎం.సృజన్ కుమార్, బద్దం సత్తిరెడ్డి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు దుస్తుల పంపిణీ



చిన్నారులకు దుస్తులు పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

మేడ్చల్‌రూరల్: నిరుపేదలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పేట్‌బషీరాబాద్ ఎస్ఐ ప్రవీణ్, గుండ్లపోచంపల్లి మున్సిపల్ కమిషనర్ రాములు కోరారు. గుండ్లపోచంపల్లిలో రోటరీ క్లబ్, సేవా భారతి ఆధ్వర్యంలో తల్లిదండ్రులు లేని చిన్నారులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొంపల్లి రోటరీ క్లబ్ అధ్యక్షుడు సుమన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా సమాజసేవలో భాగస్వామ్యం కావాలన్నారు. తాము సంపాదించిన దాంట్లో ఎంతో కొంత పేదలకు పంచి పేదరిక నిర్మూలనకు పాటుపడాలని అన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి రాహుల్, సభ్యులు పరగ్‌షా, ఆర్కే గుప్త, సురేశ్, జనాథ్, జ్యోతి, శ్వేత, రమేష్, సేవా భారతి ప్రముఖ్ హన్మంత్‌రావు, మహేశ్ పాల్గొన్నారు.

మధుమేహంపై అవగాహన ర్యాలీ



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ మెడికల్ కళాశాల, సీఎంఆర్ టెక్నికల్ కళాశాల ఆధ్వర్యంలో మేడ్చల్ పట్టణంలో జాతీయ మధుమేహ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద చైర్మన్ గోపాల్‌రెడ్డి ర్యాలీ ప్రారంభించగా అనంతరం ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, అధ్యాపకులు ప్రధాన వీధుల్లో మధుమేహంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు అలీబేగ్, రాజిరెడ్డి, డీన్ వెంకటరమణ, పీఆర్వో దుర్గాప్రసాద్‌రెడ్డి, ఏవో సురేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థి జీవితం అద్భుతం

సినీ దర్శకుడు, నటుడు తరుణ్ భాస్కర్

మల్లాపూర్: విద్యార్థి జీవితం అద్భుతమని, జీవితంలో ఎలాంటి అడ్డంకులనైనా తట్టుకునే శక్తిని పాఠశాలలోనే విద్యార్థి నేర్చుకుంటారని చిత్ర నిర్మాత, సినీ దర్శకుడు, నటుడు తరుణ్ భాస్కర్ అన్నారు. నాచారం డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్‌లో నిర్వహించిన అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవం, బాలల దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ ఆఫ్ ఎల్ఎక్స్ఎల్ ఇడియాస్ కృష్ణ చైతన్య, పాఠశాల చైర్మన్ నవనీత రావు, ప్రిన్సిపాల్ సుమ మీనన్, మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ కుమార్, చీఫ్ ఆఫ్ అకాడమిక్స్ డాక్టర్ పవన్, సాంబ, కిషోర్‌కుమార్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ స్వర్ణ, మణికంఠ, రమ్య, జానకీ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రంలో.. మేడ్చల్‌లో

కాంగ్రెస్ గెలుపు ఖాయం

మల్లారెడ్డి చేసిందేమీ లేదు.. కబ్జాలు తప్ప..



మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వజ్రేష్‌యాదవ్

మేడ్చల్‌జోన్ బృందం: నియంతృత్వ పాలన నుంచి ప్రజాస్వామ్యం విముక్తిం పొందడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ ఎమ్మెల్యే అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం శామీర్‌పేట మండలంలో గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్‌తో కలిసి అభ్యర్థి వజ్రేష్‌యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మేడ్చల్ ప్రజానీకానికి ప్రస్తుత ఎమ్మెల్యే, మంత్రి మల్లారెడ్డి చేసిందేమీ లేదని, నియోజకవర్గంలో ఉన్న ప్రభుత్వ భూములను కబ్జా చేయడమే ఆయన పాలన అని మండిపడ్డారు. శామీర్‌పేట మండలంలోని పలు గ్రామాల్లో ఇందిరమ్మ పాలనలో ఇచ్చిన పట్టాలు, ఇందిరమ్మ ఇళ్లు మాత్రమే ఉన్నాయని వివరించారు. ఒక్క పేదవాడికి కూడా ఇల్లు నిర్మించడం చేతకాని సీఎం కేసీఆర్ అని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే శామీర్‌పేట మండలంలోని సమస్యలన్నీ పరిష్కరిస్తానని వజ్రేష్‌యాదవ్ తెలిపారు.

ఘట్‌కేసర్‌లో..

మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేశ్‌యాదవ్‌ను గెలిపించాలని ఆ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాలుయాదవ్, టౌన్ అధ్యక్షుడు ఆంజనేయులుయాదవ్, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి అనిత ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో మంగళవారం ప్రచారం చేశారు. గతంలో కాంగ్రెస్ చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు హామీలను ఇంటింటికీ ప్రచారం చేశారు.

కీసరలో..

మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్ ఖాయమని కీసర మండల నాయకులు అన్నారు. మంగళవారం కీసర గ్రామంలో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా ప్రచారం నిర్వహించారు.

జంగ్ తెలంగాణ 2023



ప్రచారంలో వజ్రేష్‌యాదవ్, నక్క ప్రభాకర్ గౌడ్



కీసరలో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

అభివృద్ధి చేశా.. ఆశీర్వదించండి..



బీఆర్ఎస్‌లో చేరుతున్న మూడుచింతలపల్లి మండల యువకులు

మేడ్చల్ బీఆర్ఎస్ అభ్యర్థి మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశానని, ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించానని, నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయాలంటే ప్రజలు మరోమారు తనను ఆశీర్వదించి ఎమ్మెల్యే గెలుపించుకోవాలని మేడ్చల్ బీఆర్ఎస్ అభ్యర్థి మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో నిర్వహించిన కార్నర్ మీటింగ్ సభల్లో ఆయన మాట్లాడారు. మేడ్చల్ ఎమ్మెల్యేగా తాను చేసిన అభివృద్ధి తప్ప గత ఎమ్మెల్యేలు చేసిందేమీ లేదన్నారు.

◆ నియోజకవర్గ ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడంతో పాటు తన సొంత నిధులతో సీసీ రోడ్లు, కమ్యూనిటీ భవనాలు, ఆలయాల నిర్మాణాలు చేపట్టానని, ప్రజలు తనకు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. మేడ్చల్ ప్రజలు మరోమారు తనను భారీ మెజార్టీతో గెలిపించడం ఖాయమన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ దీపికా నర్సింహ్మారెడ్డి, వైస్ చైర్మెన్ చీర్ల రమేశ్, మార్కెట్ కమిటీ చైర్మెన్ భాస్కర్‌యాదవ్, పార్టీ అధ్యక్షుడు శేఖర్‌గౌడ్, ఇన్‌చార్జి గోపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు..

మూడుచింతపల్లి మండలంలోని పలు గ్రామాలకు చెందిన యువకులు, ఇతర పార్టీల నాయకులు, మేడ్చల్ మండలంలోని నూతన్‌కల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు గీతశ్రీనివాస్‌గౌడ్ దంపతులు, పలువురు నాయకులు మంగళవారం క్యాంపు కార్యాలయంలో మంత్రి మల్లారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. మండల ఇన్‌చార్జి గోపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి సుదర్శన్, జెడ్పీటీసీ శైలజ, సర్పంచుల ఫోరం అధ్యక్షులు విజయానంద్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటేశ్, మాజీ సర్పంచ్ రాజమల్లారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం..

మేడ్చల్ బీఆర్ఎస్ అభ్యర్థి మల్లారెడ్డిని గెలిపించాలని ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో చైర్ పర్సన్ పావనీజంగయ్య, వైస్ చైర్మన్ మాధవరెడ్డి, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాగారంలో మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి, అధ్యక్షుడు శ్రీధర్, గూడురు అంజన్న, మేడ్చల్ మండలంలోని గ్రామాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు దయానంద్‌యాదవ్ ప్రచారం చేశారు.



ఘట్‌కేసర్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్



నాగారంలో మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

ఆర్థిక సాయం



జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పాపయ్యకాలనీకి చెందిన దండు బిర్మాలు(58) గుండెపోటుతో మంగళవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు మెట్టు వెంకన్న బాధిత కుటుంబాన్ని పరామర్శించి వారికి రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో రేగు రాజు, సోమ్‌రాజు, రమేష్, కన్నా, శ్రీనివాస్, పరుశురాం, యాకయ్య, రవి, లింగం, యాదగిరి, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

'అనురాగ్'లో ఉచిత వైద్య శిబిరం



ఘట్‌కేసర్: ప్రపంచ మధుమేహ దినోత్సవం పురస్కరించుకొని వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ సెల్ యూనిట్-1 ఆధ్వర్యంలో టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మధుమేహం, థైరాయిల్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఫార్మసీ డీన్ వసుధ భక్షి, నీలిమ వైద్యులు, ఎన్ఎస్ఎస్ సెల్-1 ప్రోగ్రాం ఆఫీసర్ నవీన్, ఫార్మసీ విభాగం ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ బాబా శంకర్, వలంటీర్లు శాంతశ్రీ, సౌమ్య, చందన, దివ్యాన్ష, హర్షిత్‌చ తన్వీర్ పాల్గొన్నారు.

టపాసుల విషయంలో గొడవ.. వ్యక్తిపై దాడి

మల్లాపూర్: పెద్ద టపాసులు పేల్చవద్దని చెప్పినందుకు ఓ వ్యక్తిపై ఐదుగురు దాడి చేసిన ఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మల్లాపూర్ సూర్యనగర్ కాలనీకి చెందిన పల్లపు పుల్లయ్య, తన్నీరు సాంబశివరావు ఎదురుఎదురుగా నివాసం ఉంటారు. దీపావళి రోజు ఆదివారం సాయంత్రం పల్లపు పుల్లయ్య కుటుంబ సభ్యులతో కలిసి టపాసులు కాలుస్తున్నాడు. బాంబుల శబ్దాలు గట్టిగా రావడంతో తన్నీరు సాంబశివరావు వచ్చి చిన్న టపాసులు కాల్చుకోవాలని చెప్పడంతో పలువురు దాడి చేశారు. గాయాలు కావడంతో సాంబశివరావును ఆస్పత్రికి తరలించారు. భార్య తన్నీరు శ్రావ్య ఫిర్యాదు మేరకు నాచారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓటర్లను ఆకట్టుకునేందుకు.. వ్యూహాలు

- ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్..
- అభివృద్ధితో పేరుతో బీఆర్ఎస్
- ఒక్క అవకాశం కోసం బీజేపీ..
- రోజురోజుకూ వ్యూహాలు రచిస్తూ..
- ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు

సాక్షి, మేడ్చల్ జిల్లా: ఎన్నికల తొలి ఘట్టమైన నామినేషన్ల పర్వం ముగియడంతో ప్రచార యుద్ధానికి తెరలేచింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీలు ప్రచార వ్యూహాలు రచించడంలో నిమగ్నమయ్యాయి. దినమంతా చేరికలు, ప్రచారాలు, రాత్రి సమయంలో అనుచర వర్గంతో మంతనాలు జరుపుతున్నారు. ఎదుటి పార్టీ ప్రచార తీరును తెలుసుకుంటూ మరుసటి రోజు ఎలా ప్రచారం చేయాలన్న అంశంపై చర్చిస్తున్నారు. గెలుపోటములను శాసించే మహిళలు, నేతల రాతలు మార్చే యువత ఓటర్లను తమవైపు తిప్పుకొనేందుకు తమదైన రీతిలో చక్రం తిప్పుతున్నారు. ఎత్తుకు పైఎత్తులు వేస్తూ ప్రచార పర్వాన్ని వేగవంతం చేస్తుండటంతో చలి వాతావరణంలో రాజకీయ వేడి రాజుకుంటోంది.

ఆరు గ్యారంటీలతో.. కాంగ్రెస్

జిల్లాలో ఈసారి ఎక్కువ స్థానాలపై కాంగ్రెస్ కన్నేసింది. కొన్ని నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులు బలంగా ఉండటంతోపాటు బీఆర్ఎస్ నుంచి కొంతమంది ముఖ్యనేతలు కాంగ్రెస్‌లో చేరడంతో.. ఉత్సాహంగా ప్రచారం కొనసాగిస్తున్నారు. అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని అభ్యర్థులు, ముఖ్యనాయకులు ప్రజల్లోకి వెళ్తున్నారు. నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో క్షేత్రస్థాయిలో ప్రచారాన్ని ఉరకలెత్తించేలా ప్రణాళికలు రచిస్తున్నారు. బీఆర్ఎస్ అభివృద్ధి నినాదానికి కౌంటర్లు ఇచ్చేలా రూపొందించిన పాటలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. మల్కాజిగిరి, మేడ్చల్ నియోజకవర్గాల అభ్యర్థులైన మైనంపల్లి హన్మంతరావు, తోటకూర వజ్రేష్ యాదవ్ ఎన్నికల ప్రచారాన్ని ఉధృతం చేశారు. తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీయేనంటూ ప్రజల్లో నమ్మకం కలిగించేలా భరోసా కల్పిస్తున్నారు. రానున్న రోజుల్లో ఏఐసీసీ అగ్రనేతలతో పాటు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో బహిరంగ సభలు, రోడ్ షోలు నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నారు.

ఒక్కసారి అవకాశంతో బీజేపీ..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఈసారి కాషాయ జెండా ఎగురవేయాలన్న ధీమాతో ఆ పార్టీ అభ్యర్థులు ఓ వైపు ప్రచారం చేస్తూనే.. మరోవైపు ఇతర పార్టీల్లోని నేతలు, కార్యకర్తలను తమవైపు తిప్పుకోవడం లక్ష్యంగా పెట్టుకున్నారు. చేరికలపై కూడా దృష్టి సారించారు. పట్టణ, గ్రామాల్లోకి యువతను తమవైపు తిప్పుకొనే ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ.. బీజేపీని ఆదరించాలని కోరుతున్నారు. పట్టణంతో పాటు డివిజన్లకు పార్టీ సీనియర్లకు బాధ్యతలకు అప్పగించారు. పార్టీ అభ్యర్థులు, సీనియర్ నాయకులు వేర్వేరుగా ప్రచారం కొనసాగిస్తున్నారు. ఒక్కసారి అవకాశం ఇవ్వాలంటూ ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి, ఉప్పల్, మేడ్చల్ నియోజకవర్గాల్లో ప్రచారాన్ని నిర్వహిస్తున్న అభ్యర్థులు పార్టీ అగ్రనేతలను తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు.

చేసిన అభివృద్ధితో బీఆర్ఎస్

జిల్లాలో అభ్యర్థుల ప్రకటన నుంచి ప్రచారంలో ముందున్న బీఆర్ఎస్.. మరింత దూకుడు పెంచేలా వ్యూహాలు రచిస్తోంది. ఇప్పటికే ఐదు నియోజకవర్గాల్లో ఆత్మీయ సమ్మేళనాలు, అంతర్గత సమావేశాలు, సామాజికవర్గాల వారీగా సభలు నిర్వహించారు. జిల్లా, నియోజకవర్గ స్థాయిలో సమన్వయ కమిటీలు, గ్రామ, బూత్‌స్థాయిలో ప్రత్యేక కమిటీలను నియమించింది. వంద మంది ఓటర్లను ప్రత్యేక గ్రూపులుగా విభజించి ఓట్లు అభ్యర్థించేలా ఈ కమిటీలు ప్రణాళికలు రూపొందిస్తున్నాయి. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించాయి. సామాజిక మాధ్యమాలతోపాటు ప్రత్యేక పాటల ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

మామిడి తోటలో మందు పార్టీ

- 100 మందితో జవహర్‌నగర్‌లో విందు
- ఫిర్యాదు చేసిన 4 గంటలకు ఘటనా స్థలానికి ఎన్నికల అధికారులు

జవహర్‌నగర్: జవహర్‌నగర్‌లో వందలాది మందితో ఎన్నికల నిబంధనలు తుంగలో తొక్కి మామిడి తోటలో మందు పార్టీ నిర్వహించారు. ఎన్నికలు పారదర్శకంగా నిర్వహిస్తున్నామని ఓటర్లను ప్రభావితం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని ఓ వైపు అధికారులు ప్రకటనలు చేస్తేన్నా అది కేవలం ప్రకటనలకే పరిమితమైందని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. మంగళవారం ఉదయం 11 నుంచి జవహర్‌నగర్‌లోని లక్ష్మినర్సింహస్వామి కాలనీ సమీపంలోని ఓ ఫామ్‌హౌస్ (మామిడితోట)లో స్థానిక కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు వందలాది మంది విందు పార్టీకి హాజరయ్యారు. ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ అభ్యర్థి ప్రజలకు డబ్బు, విందు భోజనాలు ఏర్పాటు చేశారని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎన్నికల అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఓటమి భయంతోనే..

కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ఆదరణతో ఓటమి తప్పదనే బీఆర్ఎస్ నాయకులు ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారని జవహర్‌నగర్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్ అన్నారు. బీఆర్ఎస్ నాయకుల మందు, విందు భోజనాలపై ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసినా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్, ఈసీని కలిసి ఫిర్యాదు చేయనున్నామన్నారు.

పోలీసుల అదుపులో పలువురు..

మామిడి తోటలో మందు పార్టీ జరుగుతుందనే సమాచారం మేరకు జవహర్‌నగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పలు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఎన్నికల అధికారుల సూచనల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సీతారాం తెలిపారు.

నిమ్మల గార్డెన్‌లో జోరుగా పార్టీ

మేడ్చల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కండ్లకోయలో గల నిమ్మల గార్డెన్‌లో నియోజకవర్గానికి చెందిన కొంతమంది మంగళవారం రాత్రి పెద్దఎత్తున పార్టీ చేసుకున్నారు. యూనియన్ వేడుకల పేరుతో ప్రభుత్వ ఉద్యోగులు సమావేశమై యూనియన్ కోసం ప్రసంగాలు చేశారు. యూనియన్‌లో చేరిన వారిని సన్మానించి మందు పార్టీ చేసుకున్నారు. అగ్ర నాయకులు, నియోజకవర్గంలోని వివిధ మండలాల ఉద్యోగులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వ ఉద్యోగులు పార్టీ చేసుకోవడంపై సమాచారం అందుకున్న ఎన్నికల అధికారులు సోదాలు చేశారు. తమ యూనియన్‌లోకి ఇతర యూనియన్ నాయకులు చేరడం వల్ల వారిని సన్మానించేందుకు సమావేశం ఏర్పాటు చేసుకున్నామని ఓ యూనియన్ నాయకుడు తెలిపారు. మేడ్చల్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న అధికార పార్టీ నాయకులు ఓట్ల కోసం పార్టీ ఏర్పాటు చేశారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి పార్టీ చేసుకున్నారని పలువురు అంటున్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మేడ్చల్‌రూరల్: ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం యాదాద్రి జిల్లా మోటకొండూరు గ్రామానికి చెందిన మాల్గ మధు(32) కొంత కాలంగా మండలంలోని మునీరాబాద్ గ్రామంలో నివాసం ఉంటూ స్థానికంగా ఓ కంపెనీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న మధు రెండు నెలల నుంచి ఇంట్లోనే ఉంటున్నాడు. దీంతో మనస్తాపానికి గురై మంగళవారం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటనా స్థలిని పరిశీలించిన మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.



మధు(ఫైల్)

కీసరగుట్టలో ప్రారంభమైన కార్తీక మాసోత్సవ పూజలు



కీసర: కీసరగుట్ట శ్రీభవానీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం కార్తీకమాసోత్సవ ప్రత్యేక పూజలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయంలో కొలువైన శ్రీస్వామి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, క్షీరాభిషేకం, సాయంత్రం 6 గంటలకు ఆకాశ దీపోత్సవంతో కార్తీక మాసోత్సవాల ప్రత్యేక పూజలకు అంకురార్పణ చేశారు. ఆలయ చైర్మన్ తటాకం రమేష్, ఈఓ నాగేందర్, వేదపండితులు సత్యనారాయణ, రవి, బల్‌రాంశర్మ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక మాసం పూజలు ప్రారంభం

గౌతంనగర్: కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా గౌతంనగర్ డివిజన్ పరిధిలోని వాణీనగర్ విజయ వినాయక ఆలయంలో మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పాలాభిషేకం నిర్వహించారు.